ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 11-7-2025 సమయం 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మాతృభాషతో పాటు జాతీయ భాష హిందీని నేర్చుకోవడం ఎంతో ప్రయోజనకరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
2. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద ప్రజల సొంత ఇంటి కలను నిజం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు.
3. కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 14వ తేదీన సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.
4. రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది.

----------------------

**KISHEN REDDY-DAKSHIN SAMVAD**

మాతృభాషతో పాటు, మన జాతీయ భాష హిందీని నేర్చుకోవడం ఎంతో ప్రయోజనకరమని, రాజకీయాల కోసమే కొన్ని పార్టీలు హిందీని వ్యతిరేకిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో రాజ్ భాషా దక్షిణ సంవాద్ పేరుతో జరిగిన స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. హిందిని వ్యతిరేకించడమంటే అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆయన స్పష్టం చేశారు. దేశ సమగ్రతను బలోపేతం చేయడం కోసం హింది నేర్చుకోవలసిన ఆవశ్యకతను ఆయన ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ స్పీకర్ హరివంశ్, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు.

------------- బైట్ కిషన్ రెడ్డి ---------

**NSD**

------------------------

**సీతక్క –ఇందిరమ్మ ఇళ్లు**

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద ప్రజల సొంత ఇంటి కలను నిజం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. మహిళలు, పేద కుటుంబాల భవిష్యత్ కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించామని వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆమె పేర్కొన్నారు.

**డెస్క్**

-----------------------

**గవర్నర్**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మ వారిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు దర్శనం చేసుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు అమ్మవారికి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు.గవర్నర్ దంపతులతో పాటు, మంత్రి పొన్నం ప్రభాకర్ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**డెస్క్**

-------------------

**మంత్రి సీతక్క**

ఆదివాసి గిరిజన మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ములుగు జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రైన్ స్టాండ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొట్లగూడెం గ్రామంలో విస్తరాకులు తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం అభివృద్ధిపై దృష్టి సారించారని, రాబోయే మేడారం జాతరకు 112 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో జిల్లా కలెక్టర్ నివేదిక పంపించారని ఆమె వెల్లడించారు. త్వరలోనే మేడారంలో శాశ్వత ప్రాతిపాదికన నిర్మాణాలను, అభివృద్ధి పనులు చేపడతామని సీతక్క పేర్కొన్నారు.

-------------- **బైట్ సీతక్క** ----------

**PTC Mulugu**

----------------------------

**ఎమ్మెల్సీ కవిత**

బీసీ రిజర్వేషన్ల కి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్వాగతించారు. దీనిని తెలంగాణ జాగృతి సాధించిన విజయంగా భావిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని అన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని ఆమె విమర్శించారు.

**డెస్క్**

---------------------------

**మహేష్ కుమార్ గౌడ్**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ నిర్ణయం వెనక ఖర్గే, రాహుల్‌గాంధీ ఆశయం ఉందని ఆయన వెల్లడించారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరోసారి నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు. కాగా బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణ జాగృతి విజయంగా ఎమ్మెల్సీ కవిత అభివర్ణించడం పట్ల మహేష్ కుమార్ గౌడ్ అభ్యంతరం వ్యక్త చేశారు.

డెస్క్

---------------------------

**నల్లగొండ - మంత్రి ఉత్తమ్**

కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదీన సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గతంలో లాగ 2 రకాల కార్డులు ఇవ్వబోతున్నామని, అర్హత కలిగిన వారందరికీ కార్డులు ఇస్తామని అన్నారు. దాదాపుగా 5 లక్షల కొత్త రేషన్ కార్డులను అర్హులైన వారికి అందజేస్తున్నామని, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 13 వేల కోట్ల రూపాయలతో 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని అన్నారు.

**పిటిసి/నల్లగొండ**

-------------------------

**ఇంజనీరింగ్ కళాశాలు**

రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజులు పెంచాలంటూ కళాశాల యాజమాన్యాలు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. ఫీజుల పెంపు కోసం ఇచ్చిన వినతులపై తెలంగాణ ప్రవేశాలు రుసుముల నియంత్రణ కమిటీ నిర్ణయం

తీసుకోవాలని ఆదేశించింది. ఆరు వారాల్లో ఫీజులు నిర్ణయించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని హైకోర్టు స్పష్టం చేసింది.

**డెస్క్**

-----------------------

**వివేక్ వెంకటస్వామి**

ప్రాణహిత, గోదావరి నదిలో వరద ప్రవాహం ఉధృతం కావడంతో పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి సూచించారు. ప్రాణహిత నదికి ఎగువ నుంచి వరద నీరు వస్తున్న నేపథ్యంలో మంచిర్యాల జిల్లా లోని అలుగాం, అర్జునగుట్ట, అన్నారం గ్రామాలు ఇప్పటికే వరద ప్రభావానికి గురయ్యాయన్నారు. వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉండాలని, హెల్ప్ లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రాణహిత వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్ లతో పాటు వివిధ శాఖల ఆఫీసర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి ఆకాశవాణి కి తెలిపారు.

**బైట్...మంత్రి వివేక్ వెంకటస్వామి...**

**పీటీసీ/మంచిర్యాల**

------------------------------

**రాజాసింగ్**

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను భారతీయ జనతా పార్టీ ఆమోదించింది. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు రాజాసింగ్ రాజీనామాను ఆమోదించామని, ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటన

విడుదల చేశారు. కాగా, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలని కార్యకర్తలు కోరుకుంటున్నారని, ప్రజా సేవ చేసేందుకు, సనాతన ధర్మాన్ని రక్షించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన అన్నారు. తనను విశ్వసించి మూడు సార్లు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినందుకు బీజేపీ అధిష్టానానికి రాజాసింగ్ ధన్యవాదాలు తెలియజేశారు.

**డెస్క్**

------------------------

**వరంగల్ జిల్లా**

అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని వరంగల్  జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు.  ఈ రోజు ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వరంగల్ కలెక్టరేట్ లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... పెరుగుతున్న జనాభా అనేక అనర్థాలకు కారణం అవుతుందన్నారు. జనాభా నియంత్రణ అవశ్యకత విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.  జనాభా నియంత్రణ అదుపులో లేకపోతే భావితరాలకు మౌలిక వసతులు, ఆరోగ్య రంగంపై ఒత్తిడి, విద్యా వనరులపై ప్రభావము ,ఉద్యోగ అవకాశాల కొరత ,లింగ అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు వస్తాయన్నారు .

**పీటీసి/వరంగల్**

----------------------

**వాతావరణం**

రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. ఈ రోజు, రేపు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఎల్లో

అలర్ట్ జారీ చేసింది. మిగతా చోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది.

**డెస్క్**

------------------------

**జూబ్లీహిల్స్ సీసీ రోడ్లు నిర్మాణం**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈరోజు 5 కోట్ల రూపాయలకుకు పైగా అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని వెంగళ్‌రావు నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ నగరంలో బస్తీలు, కాలనీల అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్టు ఆయన తెలిపారు.

**డెస్క్**

-----------------------

**మెదక్ జిల్లా**

వర్షాకాలం ప్రారంభమైన సందర్భంలో జిల్లా వ్యాప్తంగా శానిటేషన్ పనులను విస్తృతంగా చేపట్టాలని, మురుగు కాలువలు పరిశుభ్రపరచాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అదికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి జరాలు

సోకకుండా సిబ్బంది అందుబాటులో ఉంటూ పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. ఫ్రై డే ను డ్రై డే గా నిరంతరం పాటించాలని పేర్కొన్నారు.

**పీటీసీ/మెదక్**

-------------------------

**మంచిర్యాల జిల్లా**

ప్రకృతి వైపరీత్యాల నుండి ప్రజల రక్షణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈ రోజు కోటపల్లి మండలం సిర్స, వేమనపల్లి మండలం రాచర్ల గ్రామాలలో భారీ వర్షాల కారణంగా నెలకొన్న వరద పరిస్థితులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

**పిటిసీ/ మంచిర్యాల**

-------------------------

**సీపీఎం -ధర్నా**

కూకట్ పల్లి కల్తీకల్లు సంఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కల్తీ కల్లు ఘటనలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారాన్ని అందించాలని, ఇందుకు బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**డెస్క్**

---------------------